క్లుప్తంగా

వేంకటాద్రిపై ఘనంగా కుంకుమ పూజలు



పెందుర్తి: లక్ష్మీదేవి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా స్థానిక వేంకటాద్రిపై కొలువైన లక్ష్మి అమ్మవారికి గురువారం కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు జరిపి, విశేష అలంకణ చేశారు. అనంతరం గోత్రనామార్చన జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



చెక్కు అందిస్తున్న దాత సత్యనారాయణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని నడుపూరుకు చెందిన నాగోతి సత్యనారాయణ లక్ష రూపాయల విరాళాన్ని గురువారం అందించారు. సంబంధిత చెక్కును సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో ప్రొటోకాల్ సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని అధికారులు అందించారు.

శివాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న గవర శ్రీనివాసరావు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలోని శివాలయ పునర్నిర్మాణానికి స్థానిక వ్యాపారవేత్త గవర శ్రీనివాసరావు రూ.లక్ష 116 విరాళంగా అందించారు. నిర్మాణంలో ఉన్న ఆలయం వద్ద కమిటీ సభ్యులకు గురువారం ఈ విరాళాన్ని అందించారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, మాజీ సర్పంచ్ దనిమిరెడ్డి శ్రీనివాసరావు, బర్ల రమణ, దంగేటి నాని, దంగేటి ప్రకాష్, దంగేటి నాగేశ్వరరావు, చింతల శ్రీను, కోరాడ శ్రీను, కోన సింహాచలం, గెడ్డం రమేష్, ముర్రి కనకరాజు తదితరులు ఉన్నారు.

అప్పన్నను దర్శించుకున్న అజయ్‌సేథ్




సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని కేంద్ర ఆర్థిక శాఖ రెవెన్యూ సెక్రటరీ అజయ్ సేథ్(ఐఏఎస్, న్యూఢిల్లీ) గురువారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రాన్ని ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ అందించారు.

సీసీ కాలువకు అడ్డంకిగా ట్రాన్స్‌ఫార్మర్



పరవాడ: మండలంలోని పి.బోనంగి శివారు వీఎల్ఎన్ పురంలో సీసీ కాలువ నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ప్రదేశానికి తరలించేలా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ సభ్యులు తీర్మానం చేసి సదరు నకలును విద్యుత్‌శాఖ అధికారులకు గురువారం అందించారు. ట్రాన్స్‌ఫార్మర్ తొలగింపునకు అవసరమైన వ్యయాన్ని గ్రామ పంచాయతీ సాధారణ నిధుల నుంచి వెచ్చించడానికి పంచాయతీ సిద్ధంగా ఉన్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు సదరు తీర్మానంలో పేర్కొన్నారు.



మండలంలో పంచాయతీలు 24	
పాడి రైతులు 8 వేలు	
ఆవులు	గేదెలు
10,640	7,927
గొర్రెలు	మేకలు
2,472	4,449

- మొబైల్ వెటర్నరీ క్లినిక్‌లకు 'కూటమి'మంగళం
- కానరాని సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలు
- మూత పడనున్న పశు వ్యాధి నిర్ధారణ ల్యాబ్‌లు
- ప్రశ్నార్థకంగా ఉద్యోగుల భవితవ్యం

మూగబోతున్న అంబులెన్స్‌లు



జాడలేని అంబులెన్స్‌లు, సిబ్బంది

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక **సంచార పశు వైద్య కేంద్రాల ద్వారా అందించే సేవలు ఎక్కడా కనిపించడం లేదు. ఇప్పటికే మొదటి విడతలో అందుబాటులోకి తీసుకొచ్చిన పశు అంబులెన్స్‌లు ప్రస్తుతం మూలకు చేరగా, వైద్య సిబ్బంది జాడ కనిపించట్లేదు.**

సబ్బవరం:

వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమాభివృద్ధికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. పశు పోషణను ప్రోత్సహించేందుకు సచివాలయ స్థాయిలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. పాడి రైతులకు పశు పోషణ, పాడి వృద్ధికి పశు సంవర్ధకశాఖ సహాయకులను నియమించింది. వీరి ద్వారా పశువులకు అవసరమయ్యే అన్ని రకాల సేవలతోపాటు, పశు గణన, పశు బీమా వంటి పథకాల అమలుకు సాయపడేది. అనారోగ్యంతో బాధపడే పశువులను పశు వైద్యశాలలకు తీసుకెళ్లే పరిస్థితి లేకపోవడంతో, సంచార పశు వైద్య కేంద్రా(మొబైల్ వెటర్నరీ క్లినిక్)లను అందుబాటులోకి తెచ్చింది. ఇవన్నీ గతంగా మారనున్నాయి. కూటమి ప్రభుత్వంలో ఈ సేవలన్నీ ఒక్కొక్కటిగా అటకెక్కుతున్నాయి.



గత ప్రభుత్వంలో అందుబాటులోకి తీసుకొచ్చిన సంచార పశు వైద్యశాల(ఫైల్)

1962కు కాల్ చేస్తే..

నియోజకవర్గ కేంద్రంలో ఈ సంచార పశు వైద్య సేవ అంబులెన్స్‌లు అందుబాటులో ఉంటూ, పాడి పశువులకు అత్యవసర వైద్య సేవలు అందించేవి. పాడి రైతులు తమ పశువులకు ఏ ఇబ్బంది వచ్చినా 1962 నంబర్‌కు ఫోన్ చేస్తే నిమిషాల్లో చేరుకుని, వైద్య సాయం అందించేవి. అత్యవసర సమయాల్లో పశువుల్ని ప్రధాన ఆస్పత్రులకు చేర్చి, శస్త్ర చికిత్సకు సాయపడేవి. ఒక్కో అంబులెన్స్‌లో ఔట్‌సోర్సింగ్ విధానంలో ఒక డాక్టర్, ఒక సహాయకునితోపాటు డ్రైవర్ విధులు నిర్వర్తించేవారు. ఇదంతా గత వైభవంగా మారుతోంది.

మూలకు చేరిన పశు అంబులెన్స్‌లు

నియోజకవర్గానికి కనీసం ఒక సంచార పశు వైద్య కేంద్రం ఉండేలా గత ప్రభుత్వం విధివిధానాలు ఖరారు చేసింది. దీంతో పెందుర్తి నియోజకవర్గంలోని మూడు మండలాలకు అందుబాటులో ఉండేలా ఒక అంబులెన్స్‌ను కేటాయించారు. నియోజకవర్గంలోని సబ్బవరం, పరవాడ మండలాలు అనకాపల్లి జిల్లాలో ఉండటంతో పరవాడ ప్రాంతీయ పశు వైద్యశాల పరిధిలో అందుబాటులో ఉండేలా మరో పశు సంచార వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇవన్నీ ఇప్పుడు దాదాపుగా మూలకు చేరాయి.

ఉద్యోగ భద్రతపై ఆందోళన

రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4 వేల మంది వరకు పశు సంవర్ధక సహాయకు(వెటర్నరీ అసిస్టెంట్)లు పనిచేస్తున్నారు. మండలంలోని బంగారమ్మపాలెం, నారపాడు, అసకపల్లి, మల్లునాయుడుపాలెం, బోదువలస, అమృతపురం, గుల్లేపల్లి గ్రామ సచివాలయాల పరిధిలో 8 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న సచివాలయ సిబ్బందిని రేషనలైజేషన్‌లో భాగంగా టెక్నికల్, మల్టీ పర్పస్‌గా విభజిస్తున్నారు. మల్టీ పర్పస్ విభాగంలో సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీస్, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఉండగా, టెక్నికల్ కేటగిరీలో వెటర్నరీ, అగ్రికల్చర్ అసిస్టెంట్, ఏఎన్ఎం, సర్వేయర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు ఉన్నారు.



సబ్బవరంలో ఏర్పాటు చేసిన ల్యాబ్

పెరిగిన పని భారంతో అవస్థలు

కూటమి అధికారంలోకి వచ్చిన నుంచి విధులు పూర్తిగా మారి, ఉద్యోగ భద్రతపై వెటర్నరీ అసిస్టెంట్లలో ఆందోళన మొదలైంది. ప్రస్తుతం మాతృ సంస్థ పశు సంవర్ధక శాఖతో పాటు సచివాలయంలో కూడా విధులు నిర్వర్తిస్తుండటంతో పనిభారం పెరిగిందని వాపోతున్నారు.

ల్యాబ్ మనుగడ ప్రశ్నార్థకం

సబ్బవరం ప్రాంతీయ పశు వైద్యశాలలో పశు వైద్య పరీక్షల కోసం ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో పశువులకు సబంధించిన పరీక్షలను నిర్వహించి, వ్యాధులను గుర్తిస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గ కేంద్రంలో మాత్రమే ల్యాబ్ ఉండేలా అదేశాలిస్తున్నారు. దీంతో సబ్బవరం ల్యాబ్ నిరుపయోగంగా మారే ప్రమాదం ఉంది. ల్యాబ్‌లో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగ భద్రత కూడా ప్రశ్నార్థకంగా మారనుంది.

నిలిపివేత ఆదేశాల్లేవు



మొబైల్ వెటర్నరీ క్లినిక్‌ల నిలిపివేతపై ఎలాంటి ఆదేశాల్లేవు. తొలి విడతలో ఏర్పాటు చేసిన వాటి కాలపరిమితి ముగియడంతో మార్చే అవకాశం ఉందంటున్నారు. పెందుర్తి, పరవాడ మండలాల్లోని ప్రాంతీయ పశు వైద్యశాలల పరిధిలో ఇవి పనిచేస్తాయి. దీనిపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాలి. - **ఉషాకుమారి**, ఏడీ, ప్రాంతీయ పశు వైద్యశాల, సబ్బవరం

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విడనాడాలి



తొలిపావంచా వద్ద సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అనర్థాలను వివరిస్తున్న జేడీ గ్రూప్ సభ్యులు

సింహాచలం: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రతి ఒక్కరూ విడనాడాలని జేడీ ఫౌండేషన్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం సింహాచలంలోని కొండ దిగువ తొలిపావంచా వద్ద సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై భక్తులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ ఉద్యోగి దున్నా జగన్నాథరావు యముడి వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అనర్థాలను వివరించారు. ఈ సందర్భంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో 98వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, సచివాలయ సిబ్బంది, జేడీ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: సింహగిరి పుష్కరిణి ఫీడర్ల పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఆపరేషన్స్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. దీంతో సింహాచలం, ప్రియాగార్డెన్స్, విజినిగిరిపాలెం, గాంధీనగర్, పాత అడవివరం తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

పరవాడ: వాడచీపురుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ పరమైన మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితంగా వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, దోసూరు, తిక్కవానిపాలెం పంచాయతీల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

అప్పన్న సన్నిధిలో చిల్లపల్లి



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఏపీ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు గురువారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామికి పూజలు జరిపారు. దేవస్థానం మాజీ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు సూరిశెట్టి సూరిబాబు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

కొనసాగుతున్న రైతుల ఆందోళన

పెందుర్తి: పెందుర్తి-నార్త్ సింహాచలం రైల్వే లైన్ పరిధి పొర్లుపాలెం, చింతలగ్రహారం ప్రాంతంలో తలపెట్టిన రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై రైతుల ఆందోళన కొనసాగుతోంది. గురువారం చింతలగ్రహారం సమీపంలోని శిబిరంలో రైతులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు పరిహారం ఇవ్వకుండా, తమ భూముల్ని అధికారులు లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, అయితే వంతెన నిర్మాణానికి భూములు సేకరించేందుకు సిద్ధమైన అధికారులు, పరిహారం విషయంలో ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదన్నారు. పరిహారంపై తమకు లిఖిత పూర్వక భరోసా ఇవ్వనిదే భూములిచ్చేందుకు అంగీకరించేది లేదనిని స్పష్టం చేశారు. పొర్లుపాలెం, చింతలగ్రహారం, చీమలాపల్లి, లక్ష్మీపురం ప్రాంతాల రైతులు పాల్గొన్నారు.



చింతలగ్రహారంలో ఆందోళన చేస్తున్న నాలుగు గ్రామాల రైతులు

సంపద తయారీ కేంద్రాల్లో డీపీవో పరిశీలన

పరవాడ: అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషరాణి గురువారం రావాడ, కలపాక గ్రామాలను సందర్శించారు. ఆయా గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సందర్శించి, వాటి పనితీరును పరిశీలించారు. కలపాక, రావాడ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి తడి పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్త సేకరణపై క్లాప్ మిత్రాలకు తగు సూచనలు చేశారు. కలపాక గ్రామ కంఠం రీసర్వే పనులు వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శి బి.త్రినాథ్‌ను ఆదేశించారు. ఆమె వెంట పరవాడ ఎంపీడీవో వి.ధర్మారావు, జిల్లా కోఆర్డినేటర్ కరుణాకర్ ఉన్నారు.

ఫార్మాసిటీ సమస్యలపై కేంద్ర ఆర్థిక మంత్రికి వినతి

పరవాడ: విశాఖ జేఎన్‌ఫార్మాసిటీలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించడానికి కేంద్రం తక్షణ చర్యలు చేపట్టాలని పరవాడ జేఎన్‌పీసీ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎన్.సూర్యప్రకాశరావు, కార్యదర్శి జెట్టి సుబ్బారావు కేంద్ర ఆర్థికశాఖామంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. నగరంలో నోవోటెల్ హోటల్లో పారిశ్రామికవేత్తలతో గురువారం జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆమెను కలిసి ఫార్మాసిటీలో నెలకొన్న సమస్యలను వివరించారు. కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.



సీతారామన్‌కు వినతిపత్రం అందిస్తున్న సూర్యప్రకాశరావు, సుబ్బారావు తదితరులు

భూలోకమాంబ సన్నిధిలో ఎమ్మెల్సీ గాదె



భూలోకమాంబను దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు

సింహాచలం: 98వ వార్డు అప్పన్నపాలెంలో కొలువైన భూలోకమాంబ అమ్మవారిని గురువారం రాత్రి ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు దర్శించుకున్నారు. ఆయన పేరిట అర్చకుడు అమ్మవారికి పూజలు నిర్వహించారు. శేషవస్త్రాలు అందించారు. 98వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పీతల అప్పలరాజు, ఆలయ కమిటీ నాయకులు పీతల విష్ణుమూర్తి తదితరులు గాదెను కలిసి సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆరిలోవ/పెందుర్తి: హైవేపై హనుమంతవాక కూడలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఆరిలోవ ఎస్ఐ కృష్ణ తెలిపిన వివరాలు.. పెందుర్తి.. సుజాతనగర్‌కు చెందిన ఎం.సత్యనారాయణ నగరంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం అర్ధరాత్రి నగరం నుంచి హనుమంతవాక వైపు బైక్‌పై బయల్దేరాడు. వెంకోజీపాలెం వద్ద ఓ వ్యక్తికి లిఫ్ట్ ఇచ్చాడు. హనుమంతవాక వద్ద యూటర్న్ చేస్తుండగా మధురవాడ వైపు నుంచి వస్తున్న లారీ బైక్‌ను ఢీకొంది. దీంతో సత్యనారాయణ కాలు విరిగింది. వెనక్కూర్చున్న వ్యక్తి తలకు తీవ్ర గాయమై అక్కడే ప్రాణాలు విడిచాడు. ఆరిలోవ పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి వద్ద ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ అదనపు లోడ్ క్రమబద్ధీకరించుకోండి

- ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ

సబ్బవరం: గృహ వినియోగదారులు అదనపు లోడ్ క్రమబద్ధీకరణ చేసుకునేందుకు 50 శాతం వరకు రాయితీ అందిస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో కోరారు. జూన్ నెలాఖరు వరకు ఈ అవకాశం ఉంటుందన్నారు. సాధారణ గృహ విద్యుత్ కనెక్షన్ తీసుకునే సమయంలో వినియోగదారులు 2-3 కిలో వాట్ల అనుమతితో విద్యుత్ మీటర్లు పొందారని, ఆ తర్వాత వినియోగదారులు వారి అవసరాల దృష్ట్యా ఏసీ, ఫ్రిడ్జ్ తదితర అధిక విద్యుత్ వినియోగించే ఉపకరణాలను వినియోగిస్తుంటారన్నారు. ఇలాంటి వారు తాము పొందిన లోడ్ దాటి విద్యుత్ వినియోగించినట్లు తనిఖీల్లో తేలితే కేసు నమోదు చేస్తామన్నారు. ముందుగానే అదనపు కిలోవాట్‌కు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.200, డెవలప్‌మెంట్ చార్జీగా రూ.2 వేలుతో పాటు దరఖాస్తు రుసుం రూ.50 చెల్లించి క్రమబద్ధీకరించుకోవాల్సిందిగా సూచించారు. ఇందుకు సమీపంలోని మీ సేవ, ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్, గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

'ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయండి'

సబ్బవరం: ఈ నెల 17 నుంచి ప్రారంభమయ్యే టెన్త్ పరీక్షలను ఎలాంటి ఒత్తిడికి లోనవకుండా రాయాలని ఎంఈవో ఎం.జె.రవీంద్రబాబు విద్యార్థులకు సూచించారు. స్థానిక కేజీబీవీని గురువారం సందర్శించి, విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. హాల్‌టికెట్లలో ఏమైనా తప్పులుంటే హెచ్‌ఎం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. మండలంలో 5 పరీక్షా కేంద్రాల్లో టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో మృదుల తదితరులు ఉన్నారు.

అమ్మలు.. ఆడిపాడిన వేళ



మ్యూజికల్ చైర్ ఆడుతున్న విద్యార్థుల తల్లులు



విద్యార్థుల తల్లులతో కలిసి పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

పెందుర్తి: మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. గురువారం కళాశాలలో విద్యార్థుల తల్లులతో ఆటలు ఆడించి ఉత్సాహాన్ని నింపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మ్యూజికల్ చైర్, అంత్యాక్షరి తదితర ఆటలు ఆడి, పాటలు పాడించి సందడి చేశారు. మహిళా దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మహిళా దినోత్సవం నాడు కళాశాలలో జరగనున్న కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందిస్తామని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తెలిపారు.

100 అడుగుల వెడల్పున లంకెలపాలెం-అసకపల్లి రోడ్డు

- భూ సేకరణ గ్రామ సభలో ఆర్డీవో షేక్ ఆయేషా

సబ్బవరం: మండలంలోని పైడివాడ అగ్రహారం నుంచి లంకెలపాలెం-అసకపల్లి రోడ్డును అనకాపల్లి జిల్లా కోడూరు గ్రామంలోని ఏపీఐఐసీ ఎంఎస్ఎంఈ పార్కు వరకూ రెండు వరసల రహదారిగా విస్తరించనున్నట్లు ఆర్డీవో షేక్ ఆయేషా తెలిపారు. మండలంలోని పైడివాడ అగ్రహారంలో రోడ్డు విస్తరణకు అవసరమయ్యే భూ సేకరణపై రైతులకు అవగాహన కల్పించేందుకు గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో 100 అడుగుల వెడల్పున రెండు లేన్లలో 2.68 కి.మీ. మేర ఈ రోడ్డును విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు విస్తరణ డీపీఆర్ ముసాయిదా ఇప్పటికే సిద్ధమైందన్నారు. గ్రామంలో 12.26 ఎకరాల మేర భూమిని సేకరించే అవకాశం ఉందని వెల్లడించారు. విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు వీఎంఆర్‌డీఏ ద్వారా టీడీఆర్ బాండ్లు జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిన్నికృష్ణ, మండల సర్వేయర్ అప్పారావు, ఆర్ఐ వీరయ్య, వీఆర్వో దేముడుబాబు, ఎంపీటీసీ సీరం అప్పలరాజు, గ్రామ పెద్దలు అక్కిరెడ్డి దుర్గినాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో షేక్ ఆయేషా

మహిళల హక్కుల కోసం నిరంతర పోరాటం

పెందుర్తి: సమానత్వంతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని, మహిళలకు అవకాశాలిస్తే వారు అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తారని సీఐటీయూ, ఐద్వా, డీవైఎఫ్ఐ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వీరి ఆధ్వర్యంలో పెందుర్తి అంబేడ్కర్ విగ్రహం నుంచి చినముషిడివాడ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ మహిళల హక్కుల కోసం పోరాటం చేసిన ప్రతీ ఒక్కరికీ స్ఫూర్తిదాయకమైన రోజు మార్చి 8 అని పేర్కొన్నారు. వ్యవసాయం నుంచి అంతరిక్షం వరకు అన్ని రంగాల్లో మహిళలు తమ సత్తా చాటుతున్నారన్నారు. నేటికీ చట్ట సభల్లో మహిళలకు సముచిత స్థానాన్ని పాలకులు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై రోజురోజుకీ హింస, వేధింపులు పెరుగుతున్నాయన్నారు. మద్యం, మత్తుపదార్థాలు, గంజాయి, డ్రగ్స్ వల్ల మహిళలపై హింస పెరిగిపోతోందన్నారు. మద్యాన్ని అరికట్టాల్సిన ప్రభుత్వాలు దాన్ని ఆదాయవనరుగా చూస్తున్నాయని ఆక్షేపించారు. కార్యక్రమంలో సిటు జిల్లా కార్యదర్శి బి.జగన్, జోన్ ప్రధాన కార్యదర్శి జి.శంకరరావు, నాయకులు అప్పలనాయుడు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవి, నాగమణి, రత్నకుమారి, నాగలక్ష్మి, మధ్యాహ్న భోజనం యూనియన్ నాయకులు వరలక్ష్మి, వీవోఏ నాయకులు శ్రీలక్ష్మి, డీవైఎఫ్ఐ నాయకులు ప్రభుదేవా, ఐద్వా మహిళా సంఘం నాయకులు మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శన చేస్తున్న సిటు, ఐద్వా, డీవైఎఫ్ఐ ప్రతినిధులు